నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 5 ఫిబ్రవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

'స్థానిక' ఎన్నికల్లో విజయమే లక్ష్యం

బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 4: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఏ సమయంలోనైనా వచ్చే అవకాశం ఉన్నందున పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత ఉన్నదని, ప్రజల విశ్వాసాన్ని ప్రభుత్వం కోల్పోయిందని పేర్కొన్నారు. కష్టపడి పనిచేస్తే భవిష్యత్ అంతా మనదేనని, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు నిత్యం ప్రజల్లో ఉండాలని, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్‌లుగా బరిలో నిలిచే అభ్యర్థులు ప్రజలతో మమేకం కావాలన్నారు. వారి సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూడాలన్నారు. అత్యధిక స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకునేందు సమష్టిగా పని చేయాలని ఆయన కోరారు.

ఉద్దేశపూర్వకంగానే 'లక్కినేని'పై కేసు

రాత్రికి రాత్రే హడావిడి అరెస్టు ఏమిటి?: ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

సబ్ జైలువద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, చిత్రంలో దిండిగాల

ఇల్లెందు, ఫిబ్రవరి 4: డీసీసీబీ డైరెక్టర్, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావుకు ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేక రైతుల చేత ఉద్దేశపూర్వకంగా కేసు పెట్టించారని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్ అన్నారు. ఇల్లెందు సబ్ జైలులో ఉన్న సురేందర్‌రావును బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ సోమవారం కేసు పెట్టిన రైతులు వచ్చి మాకు నష్టపరిహారం ఇప్పించండి.. కేసు వద్దు.. వెనక్కి తీసుకుంటామని పోలీసులకు చెప్పినా వినిపించుకోలేదని, హడావిడిగా రాత్రికి రాత్రే సురేందర్‌రావును అరెస్ట్ చేసి జైలులో పెట్టడం అప్రజాస్వామికమన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ నాయకులు.. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గ్రామసభల్లో ప్రభుత్వ పథకాలు, ప్రజా సమస్యలపై ప్రశ్నించిన ప్రజలను, సోషల్ మీడియాలో వ్యతిరేకంగా ఉన్న బీఆర్ఎస్ ప్రతినిధులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి బెదిరింపులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇవన్నీ గమనిస్తున్న ప్రజలు సరైన సమయంలో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. లక్కినేనిని పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దిండిగాల రాజేందర్, జేకే శ్రీను, రంగనాథ్, అజ్మీరా బావ్‌సింగ్, నబి, పరుచూరి వెంకటేశ్వర్లు, రాజేశ్, హరిప్రసాద్, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

మణుగూరు పోలీస్ స్టేషన్‌లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు

దిండిగాలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

అన్నపురెడ్డిపల్లిలో..

దమ్మపేట పీఎస్‌లో..

- భద్రాద్రి జిల్లాలో బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కొన్ని మండలాల్లో సోమవారం అర్ధరాత్రే పోలీసుస్టేషన్లకు తరలింపు
- కులగణనపై అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను అడ్డుకుంటారనే అనుమానం
- పోలీసులను రంగంలోకి దింపి ముందస్తు అరెస్టులు చేయించిన ప్రభుత్వం
- కారణం చెప్పకుండా అర్ధరాత్రి వేళ బీఆర్ఎస్ నేతలను తీసుకెళ్లిన పోలీసులు
- అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం: రేగా, వనమా, హరిప్రియ, మానె రామకృష్ణ

తెల్లవారక ముందే అరెస్టులు

బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధకాండను ప్రయోగిస్తున్నది. తన తప్పుడు విధానాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్షం గొంతును ఎక్కడికక్కడ నొక్కేయాలని చూస్తున్నట్లు కన్పిస్తున్నది. ఇందులో భాగంగానే భద్రాద్రి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను పోలీసులతో ముందస్తు అరెస్టులు చేయించింది. తప్పులతడకగా ఉన్న బీసీ కులగణన సర్వేపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నిలదీసింది. దీనిని జీర్ణించుకోలేని రేవంత్ ప్రభుత్వం.. బీఆర్ఎస్‌ను గొంతెత్తకుండా చేయాలని భావించింది. అందులో భాగంగానే మంగళ వారం జరిగే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను, అందులో జరిగే బీసీ కులగణన చర్చను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని అనుమానించింది. బీసీ కులగణనను ఆమోదించుకునే క్రమంలో బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీని ముట్టడిస్తారేమోనని తరలించింది. ఈ అనుమానంతోనే భద్రాద్రి జిల్లా పోలీసులకు సోమవారం రాత్రే ఆదేశాలు పంపింది. బీఆర్ఎస్ నేతలను ఎక్కడికక్కడే కట్టడి చేయాలని సంకేతాలిచ్చింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. సోమవారం అర్ధరాత్రి, మంగళ వారం తెల్లవారుజామున భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకుల ఇళ్లకు వెళ్లారు. ఉన్నపళంగా వారిని అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్లకు తరలించారు. మంగళ వారం మధ్యాహ్నానికి వారి నుంచి సంతకాలు తీసుకొని వ్యక్తిగత పూచీకత్తులపై విడుదల చేశారు. -నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 4

అశ్వారావుపేట పోలీసు స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న బీఆర్ఎస్ నాయకులు

చండ్రుగొండ, భద్రాచలం పోలీసు స్టేషన్లలో బీఆర్ఎస్ నాయకులను ఉంచిన పోలీసులు

పాలనా వైఫల్యమే అరెస్టులకు నిదర్శనం: బీఆర్ఎస్

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యమే తమ అక్రమ అరెస్టులకు నిదర్శనమని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. అసెంబ్లీ ముట్టడికి తమ పార్టీ పిలుపును ఇవ్వనప్పటికీ.. అభద్రతాభావం, భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకుల అరెస్టులకు పూనుకుందని విమర్శించారు. తమది ప్రజాపాలనంటూ చెప్పుకుంటున్న రేవంత్ ప్రభుత్వం.. పోలీసు పహరాలతో పాలన అందిస్తోందని దుయ్యబట్టారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి పోలీసుస్టేషన్లకు తరలించాలని పోలీసులను ప్రభుత్వం ఆదేశిస్తోందని అన్నారు. దీంతో అరెస్టులకు కారణాలు పోలీసులకు కూడా తెలియడం లేదని, కేవలం ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు తమను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనావిధానం సక్రమమైతే ప్రతిపక్షానికి ఎందుకు భయపడాలని ప్రశ్నించారు. ప్రజల పక్షాన గొంతెత్తనీయకుండా ప్రతిపక్షాన్ని నిర్బంధించడం, నేతలను అక్రమంగా అరెస్టు చేయడం ఏమిటని నిలదీశారు. కాగా, బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులను బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, బానోతు హరిప్రియానాయక్, మెచ్చా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి మానె రామకృష్ణ తదితరులు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. అయితే, అరెస్టయిన వారిలో భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్‌రావు, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నేతలు ఉన్నారు.

ల్యాబ్‌ల్లోకి సీసీ కెమెరాలు

- నేడు అమర్చనున్న ఇంటర్ బోర్డు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

ప్రాక్టికల్ జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న డీఐఈవో రవిబాబు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 4: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రాక్టికల్ పరీక్షల్లో భాగంగా ప్రైవేట్ కళాశాలల్లోని ల్యాబ్‌ల్లో సీసీ కెమెరాలు అమర్చేందుకు ఇంటర్‌బోర్డు నిర్ణయం తీసుకుంది. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో నిబంధనలకు విరుద్ధంగా ల్యాబ్‌ల్లో సీసీ కెమెరాలు లేకుండా ఉండటం పట్ల మంగళవారం 'నమస్తే తెలంగాణ'లో 'కారిడార్‌లో కెమెరాలు.. ల్యాబ్‌ల్లో ప్రాక్టికల్స్' అనే శీర్షికన కథనాన్ని ప్రచురించింది. కథనానికి ఇంటర్ బోర్డు అధికారులు స్పందించారు. వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా హైదరాబాద్ ఇంటర్‌బోర్డు నుంచి సీసీ కెమెరాలు తెప్పించి బుధవారం జిల్లాలోని 49 ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ల్యాబ్‌ల్లో అమర్చనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి కె రవిబాబు తెలిపారు. ప్రతి కళాశాలలో నాలుగు నుంచి ఐదు వరకు సీసీ కెమెరాలు అమర్చి వాటిని ఇంటర్ బోర్డు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేయనున్నారు. ప్రాక్టికల్ పరీక్షల అనంతరం సీసీ కెమెరాలను పబ్లిక్ పరీక్షలు జరిగే కేంద్రాల్లో అమర్చనున్నట్లు డీఐఈవో వివరించారు. పరీక్షలు జరుగుతున్న కేంద్రాలను డీఐఈవో తనిఖీ చేశారు. రెండోరోజు జరిగిన పరీక్షల్లో ఉదయం సెషన్‌లో 3,380 మందికి గాను 3,247 మంది హాజరుకాగా మధ్యాహ్నం సెషన్‌లో 2,941 మందికి గాను 2,846 మంది హాజరయ్యారు.

చరిత్ర ప్రతిబింబించేలా పర్యాటకాభివృద్ధి

టూరిజం శాఖ అధికారుల సమీక్షలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పర్యాటక శాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 4: చరిత్ర ప్రతిబింబించే విధంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, అందుకు అవసరమైన చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి పురావస్తు, పర్యాటక శాఖ అధికారులతో నేలకొండపల్లి బౌద్ధ స్తూపం, పాలేరు లేక్, ఖమ్మం ఖిల్లా పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై సమీక్షించారు. ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చారిత్రక ప్రాంతాల వద్ద సిమెంట్ కట్టడాలను తగ్గించాలని సూచించారు. ఆయా ప్రాంతాలకు సందర్శకులు వచ్చినప్పుడు వారికి చరిత్ర తెలిసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. బౌద్ధ స్తూపం వద్ద ఓపెన్ ఎయిర్ మ్యూజియం ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను తెలిపే విధంగా జాతీయ రహదారుల వెంట బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఖిల్లా వద్ద సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఖిల్లా చుట్టూ పెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్డీవో నర్సింహారావు, ఆర్కిటెక్చర్ సత్యశ్రీనివాస్, సీనియర్ ఇంజినీర్ వెంకటేశ్, టూరిజం డీఈలు రామకృష్ణ, శ్రీధర్, పురావస్తు శాఖ ఏడీ బి.మల్లునాయక్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీదేవిపల్లిలో నిరవధిక సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

చెత్తబండి రాదమ్మో..

- పంచాయతీ పారిశుధ్య కార్మికులకు పెరిగిన పనిభారం
- వేతన చెల్లింపులోనూ వివక్ష చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- గత సర్కారులో రూ.13 వేల పైనే.. కానీ ఇప్పుడు కేవలం రూ.9,500
- నాలుగో రోజుకు చేరిన ఐదు పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె
- మల్టీ పర్పస్ విధానం, జీవో నంబర్ 51 రద్దు చేయాలంటూ డిమాండ్

తెల్లవారుజామునే మనకు వినిపించేది గ్రామపంచాయతీ వారి చెత్త సేకరణ సమాచారం మైకు. 'ఆ రండమ్మా రండీ.. చెత్త బండి వచ్చిందమ్మా' అంటూ విజిల్ వేసి ఇంటి ముందుకొచ్చి పారిశుధ్య సిబ్బంది చెత్తను సేకరించి తీసుకెళ్తుంటారు. ఇళ్ల ముందు, రోడ్ల వెంట, మురుగు కాల్వల్లో ఉన్న చెత్తాచెదారం, మృతిచెందిన కుక్కలు కళేబరాలు, కోళ్ల వ్యర్థాలను తీసుకెళ్లి ఊరి బయట ఉన్న డంపింగ్ యార్డుకు తరలించడం వీరి విధి. పనిభారం పెరిగినప్పటికీ ఎంతో ఓపికగా తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఇంత చాకిరీ చేస్తున్నా తమ కుటుంబ పోషణకు సరిపోయేంత జీతం రావడం లేదని, ఇప్పుడు వచ్చే వేతనంతో బతకడం కష్టంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నెలకు రూ. 12 వేల నుంచి రూ.17 వేల వరకు జీతం వచ్చేది. అప్పటివరకు అంతా సజావుగా సాగింది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు వేతనాల్లో కోత విధించడంతో కార్మికులు సతమతమవుతున్నారు. కుటుంబ పోషణ ఎలా అంటూ దిగులు చెందుతున్నారు. చేసేది లేక జిల్లా కేంద్రంలో ఐదు పంచాయతీల కార్మికులు రోడ్డెక్కారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి నిరవధిక దీక్షలు చేపట్టారు. -భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ)

నీళ్లు వదల్లే.. ఎక్కడి చెత్త అక్కడే..

మూలనపడ్డ పంచాయతీ ట్రాక్టర్

జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఐదు పంచాయతీలకు చెందిన కార్మికులకు వేతనాలు సరిపోకపోవడంతో నిరవధిక దీక్షలకు దిగారు. దీక్షలకు పలువురు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. నిత్యం వెట్టిచాకిరీ చేసే కార్మికులకు పూర్తిస్థాయిలో వేతనాలు ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. ఒకటో తేదీ నుంచి పంచాయతీ కార్మికులు నిరవధిక దీక్షలు చేస్తుండడంతో గ్రామాల్లో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. కనీసం తాగునీటి కోసం పంపునీరు వదలే వారు లేకపోవడంతో ఆయా పంచాయతీల పరిధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం నాల్గవ రోజు అధికారులు కార్మికులను బతిమిలాడితే జనం ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని నీళ్లు వదిలి మళ్లీ దీక్షల్లో కూర్చున్నారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి..

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత మల్టీపర్పస్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చి పారిశుధ్య కార్మికులను ఇబ్బందులకు గురిచేసున్నది. చదువుకున్న వారికి ఆఫీసు పనులు అప్పగించకుండా చెత్త సేకరించే పనులు అప్పగించడం వల్ల పెద్ద చదువులు చదివినా చెత్త ఎత్తాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక దశలో డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నా లేకున్నా చెత్త ట్రాక్టర్ నడపాల్సి వస్తున్నదని, జీవో నెంబర్ 51 అమలు చేయడం వల్ల కార్మికులకు సరిపడా వేతనాలు కూడా రావడం లేదని ఆందోళన చెందుతున్నారు.

పాత వేతనాలే ఇవ్వాలి..

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మంచి జీతం వచ్చేది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో తక్కువ జీతం ఇస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేయాల్సిందే. ఎండా లేదు.. వానా లేదు. మా పని మాదే. ఇంత చేసినా వచ్చే జీతంతో కుటుంబం గడవడం లేదు. రెక్కలు పోను ఎందుకు వెట్టిచాకిరీ చేసి.

-వజ్జ ఆదిలక్ష్మి, పంచాయతీ కార్మికురాలు, సంజయ్‌నగర్, లక్ష్మీదేవిపల్లి

ఎలాంటి మురుగైనా తియ్యాల్సిందే..

సామాన్యంగా మురుగు వద్దకు ఎవరూ వెళ్లరు. ముక్కు మూసుకొని వెళ్లినా కడుపులో తెములుతుంది. ప్రాణం పోయినంత పని అవుతుంది. అయినా మా మీద ప్రభుత్వం కనికరం చూపడం లేదు. జీతాల చెల్లింపులో వివక్ష చూపుతున్నది. ఇంటికి వెళ్లి అన్నం తినాలంటే చేతులు అన్నంలో పెట్టలేని పరిస్థితి మాది.

-పాయం సతీశ్, అశోక్‌నగర్ జీపీ, లక్ష్మీదేవిపల్లి మండలం

బాలల రక్షణకే 'బాలరక్షా భవన్'

కార్యాలయం ప్రారంభంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

అధికారులతో మాట్లాడుతున్న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : బాలల రక్షణ కోసమే బాల రక్షా భవన్‌ను ఏర్పాటు చేశామని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ తెలిపారు. జిల్లా కేంద్రం కొత్తగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాల రక్షాభవన్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల రక్షా భవన్‌లోని అన్ని గదులను కలెక్టర్ పరిశీలించారు. బాలల రక్షణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. బాల రక్షాభవన్‌లో కావాల్సిన వస్తువులు, కార్యాలయానికి అవసరమైన కంప్యూటర్లు, ఇతర సామగ్రి ఏర్పాటుకు నివేదికలు అందజేయాలని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమాధికారి స్వర్ణలతను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాల రక్షా భవన్‌లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయమండలి, ప్రత్యేక బాలల పోలీస్ విభాగం, జాతీయ బాల కార్మిక నిర్మూలన పథకం, జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసర్, చైల్డ్‌లైన్ అన్ని కలిపి ఒకేచోట అందుబాటులో ఉంటాయన్నారు. బాలల రక్షణకు సంబంధించిన అన్ని అంశాలు సంబంధితశాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతీరాణి, డీసీడీవో హరికుమారి, సీడబ్ల్యూసీ మెంబర్ సుమిత్రాదేవి, సాధిక్, సందీప్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై దృష్టి పెట్టండి

- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించండి
- పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులకు సెలవులు ఇవ్వొద్దు
- ఆశ్రమ పాఠశాల తనిఖీలో భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలపై సూచనలు చేస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 4: పదో తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వంద శాతం ఫలితాలు రాబట్టేందుకు కృషి చేయాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. ఉప్పుసాక గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు అపరిశుభ్రంగా ఉండటం, సైన్స్ ల్యాబ్ నిర్వహణ తీరుపై హెచ్ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులతో సమావేశమైన పీవో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సబ్జెక్టు టీచర్లు వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులకు సెలవులు ఇవ్వొద్దని, పాఠశాలను విడిచి వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత హెచ్ఎంలపై ఉందన్నారు. హెచ్ఎం, వార్డెన్, సిబ్బంది స్థానికంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ తరగతి గదిని పీవో పరిశీలించారు. హెచ్ఎం భీమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.